# రైతులు ఎరువుల కోసం యాప్ లో బుక్ చేసుకోవాలి

## ఏడిఏ శ్రీనివాస్

**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 17:** కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు కాకినాడ, కృష్ణ జిల్లాలను ఎరువులు పంపిణీకి ఎరువులు విక్రయం ఫ్రేమ్ వర్క్ యాప్ క్రింద పైలట్ జిల్లాలుగా ప్రకటించారని తద్వారా తమ సమీప డీలర్ల వద్ద ఎరువులు అనగా యూరియా, డిఎపి, కాంప్లెక్స్ సూపర్ మరియు పొటాష్ అన్ని ముందుగా యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని అలా బుకింగ్ చేసుకున్న వారికి ఆ యొక్క డీలర్ ఎరువులు విక్రయిస్తారని జగ్గంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు గరిమెళ్ళ శ్రీనివాస్ తెలియజేశారు. ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా ఏ మండలం వారు ఆ మండలంలో బుకింగ్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా డీలర్లు ఆ మండలం రైతులకు మాత్రమే ఎరువులు ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం నార్మల్ దశలో ఉన్నందున రైతులు ఒకటి రెండు బస్తాలు యూరియా బుకింగ్ చేసుకోవాలని తదుపరి సరుకు వచ్చినప్పుడు మరల పంట అవసరాలకు కొనుగోలు చేయవచ్చన్నారు. రైతులకు ఎరువులు టోకెన్ ఫెర్టిలైజర్ ఫ్రేమ్ వర్క్ యాప్ లో బుకింగ్ రాకపోతే స్మార్ట్ ఫోన్ లేకపోతే మీ పరిధిలో ఉన్న రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బంది బుకింగ్ చేసి క్యూఆర్ కోడ్ ను ప్రింట్ చేసి ఇస్తారని ఈ సౌకర్యాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. బుధవారం జగ్గంపేట మండల వ్యవసాయ అధికారి ఎస్.నరసింహ జగ్గంపేట మండలంలో ఉన్న డీలర్లకు ఈ ఎరువుల యాప్ గురించి వివరంగా తెలియజేశారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# వానపల్లి యూనిట్ పరిధిలో రైతులకు భీజామృతంతో విత్తన శుద్ధి





**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 17:** కొత్తపేట మండలం వానపల్లి యూనిట్ పరిధిలోని కొత్తపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు వరి విత్తనాల శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. రైతులు బండారు ధనరాజు, అంజిబాబు, నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, సుబ్రమణ్యం, అర్జునరావులకు చెందిన 150 కిలోల వరి విత్తనాలకు భీజామృతంతో విత్తన శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ భీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల నేల ద్వారా, విత్తనాల ద్వారా సంక్రమించే వివిధ రకాల తెగుళ్ల నుంచి పంట తొలి దశలోనే రక్షణ లభిస్తుందని తెలిపారు. అలాగే విత్తనాల మొలక శాతం గణనీయంగా పెరగడంతో పాటు పంటకు అవసరమైన సూక్ష్మ పోషకాలు అందుతాయని, వేరు వ్యవస్థ బలంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంటీ వెంకట్ ప్రసాద్, ఐసీఆర్పీ శ్రీలక్ష్మి, స్థానిక రైతులు పాల్గొన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఆసక్తి వ్యక్తం చేస్తూ భీజామృతం వినియోగంపై మరింత సమాచారం తెలుసుకున్నారు.





# ప్రజా ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయం.

-జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 17:** ప్రజా ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండల సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. బుధవారం కిర్లంపూడి మండలం రామకృష్ణాపురం గ్రామంలో 36 లక్షల రూపాయలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ ను జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. రామకృష్ణాపురం చేరుకున్న జ్యోతుల నెహ్రూకు గ్రామ టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ కంటా శ్రీను ఆధ్వర్యంలో గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా ఆరోగ్య పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో స్మశాన వాటికకు వెళ్లేందుకు ఏలేరు కాలువపై వంతెన నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి, ఎం పి డి ఓ, బాయిశెట్టి హరికృష్ణ,ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, ఎంపీపీ తోట రవి,వీరవరం, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షులు తోట గాంధీ,కుర్ల చినబాబు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంరెడ్డి కాశీబాబు, టిడిపి నాయకులు చదరం చంటిబాబు,తూము కుమార్,జ్యోతుల రాంబాబు,గంధం ఈశ్వరరావు,గొడే దొరబాబు, నీలం శ్రీను,తూము శ్రీ రామమూర్తి, అనుకుల శ్రీకాంత్,గౌతు చిన్న,పాఠంశెట్టి మురళీకృష్ణ,మంచికంటి శ్రీను,జంపన రవివర్మ,సూతి శ్రీను,గండే కాశీ, కందా సత్యానందం,పలువురు వైద్య సిబ్బంది,పంచాయతీరాజ్ శాఖ డిఇ,వై ఉమాశంకర్,ఇంచార్జ్ ఏ ఇ, పి నిరుపం, టెక్నికల్ అసిస్టెంట్ సిద్దు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన బాలిక కుటుంబాన్ని పరామర్శించిన హోంమంత్రి అనిత





**కాకినాడ/తుని పెన్ పవర్,జూన్ 17:** కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారం గ్రామంలో అదృశ్యమైన బాలిక జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ సానా సతీష్ బాబు,ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ కూడా కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. బాలిక అదృశ్య ఘటనపై దర్యాప్తు పురోగతిని జిల్లా ఎస్పీని అడిగి తెలుసుకున్న హోంమంత్రి, గత 12 రోజులుగా చేపడుతున్న గాలింపు చర్యల వివరాలను సమీక్షించారు. అనంతరం చిన్నారి తల్లిదండ్రులు సుంకర గణేష్, భవాని నివాస ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ,చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కావడం అత్యంత దురదృష్టకరమైన,బాధాకరమైన ఘటన అని అన్నారు. తల్లిదండ్రులు గణేష్,భవాని దంపతులు తమ ఇద్దరు కుమార్తెలతో కలిసి గ్రామంలో నివసిస్తున్నారని,చిన్న కుమార్తెకు స్నానం చేయిస్తున్న సమయంలో జ్ఞానేశ్వరి కనిపించకుండా పోయిందని తెలిపారు. చిన్నారి ఆచూకీ కోసం పోలీసులు మొదటి నుంచే విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టారని చెప్పారు. చుట్టుపక్కల సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించడంతో పాటు, ఎస్డీఆర్ఎఫ్,ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, డాగ్ స్క్వాడ్,డ్రోన్లు,అటవీ శాఖ సిబ్బంది సహకారంతో ప్రతి కోణంలో అన్వేషణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులను కూడా క్షుణ్ణంగా విచారిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వం ఈ ఘటనను అత్యంత సీరియస్‌గా తీసుకుందని,ప్రతిరోజూ ఎస్పీతో మాట్లాడి పరిస్థితిని సమీక్షిస్తున్నామని హోంమంత్రి తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటిని పోలీసులు పరిశీలించి, స్థానికుల నుంచి సమాచారాన్ని సేకరించారని చెప్పారు.

చిన్నారి విషయంలో సోషల్ మీడియా, పత్రికల్లో నిర్ధారణ లేని వార్తలను ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అలాంటి ప్రచారాలు బాధిత కుటుంబ సభ్యుల మనోభావాలను దెబ్బతీస్తాయని అన్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి సురక్షితంగా తిరిగి ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ,ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం కుటుంబానికి అండగా ఉంటుందని హోంమంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అనారోగ్య బాలికకు అండగా మంత్రి సుభాష్

- చైత్ర హాసిని వైద్య చికిత్స కోసం రూ.20 వేల ఆర్థిక సహాయం

**రామచంద్రపురం, పెన్ పవర్ జూన్ 17:** మానవతా దృక్పథంతో ప్రజలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాలికకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి భరోసా కల్పించారు. రామచంద్రపురం రూరల్ మండలం పెద్దతాళ్లపొలం గ్రామానికి చెందిన దొమ్మేటి శ్రీనివాస్, గీతాంజలి దంపతుల కుమార్తె చైత్ర హాసిని కొంతకాలంగా వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ వెంటనే స్పందించి, బాలిక వైద్య చికిత్స కోసం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, చిన్నారి చైత్ర హాసిని త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, అవసరమైతే భవిష్యత్తులో కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ కుటుంబానికి అండగా నిలిచి, మానవతా దృక్పథంతో సహాయం చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు చైత్ర హాసిని కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి అందించిన ఆర్థిక సహాయం తమకు ఎంతో ఊరట నిచ్చిందని పేర్కొన్నారు.




# మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు: మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి



**కాకినాడ రూరల్, పెన్ పవర్,జూన్ 17:** రాజకీయాల్లో విభేదాలు సహజమేనని, ప్రభుత్వ విధానాలను విమర్శించే హక్కు ప్రతిపక్షాలకు ఉన్నప్పటికీ మహిళల వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమంజసం కాదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పిల్లి అనంతలక్ష్మి అన్నారు.హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ వాకలపూడిలో కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ, హోంమంత్రి పనితీరుపై విమర్శలు చేయకుండా ఆమె రూపురేఖలు, మేకప్‌ను లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. ఈ వ్యాఖ్యలు కేవలం అనితను మాత్రమే కాకుండా, తమకు నచ్చిన విధంగా హుందాగా, ఆత్మవిశ్వాసంతో జీవించే ప్రతి మహిళను అవమానించేలా ఉన్నాయని అన్నారు.మహిళల గౌరవం గురించి మాట్లాడే వైసీపీ నాయకత్వం తమ పార్టీ నేతల ఇలాంటి వ్యాఖ్యలను ఖండిస్తుందా లేదా సమర్థిస్తుందా అని ఆమె ప్రశ్నించారు. రాజకీయంగా ఎదుర్కోలేక మహిళల వ్యక్తిగత విషయాలను విమర్శించడం వైసీపీ సంస్కృతిని ప్రతిబింబిస్తోందని ఆరోపించారు.దళిత మహిళ ఆత్మవిశ్వాసంగా,అందంగా కనిపిస్తే వైసీపీ నేతలకు ఎందుకు అసహనం కలుగుతోందని ప్రశ్నించిన అనంతలక్ష్మి, మహిళలు తమకు నచ్చిన విధంగా తయారవడం వారి వ్యక్తిగత హక్కు అని పేర్కొన్నారు. మేకప్‌ను రాజకీయ విమర్శగా మార్చి మహిళలను అవమానించడం సరికాదన్నారు. గతంలోనూ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేతల విషయంలో వైసీపీ నాయకత్వం మౌనం పాటించిందని ఆరోపించిన ఆమె, మహిళా ప్రజాప్రతినిధులపై వ్యక్తిగత దూషణలు జరిగిన సందర్భాల్లోనూ ఆ పార్టీ నుంచి ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.కూటమి ప్రభుత్వం మహిళల భద్రత, గౌరవ పరిరక్షణ విషయంలో రాజీ పడటం లేదని అనంతలక్ష్మి స్పష్టం చేశారు. మహిళలపై వేధింపులు, అసభ్యకర వ్యాఖ్యల విషయంలో చట్టం ముందు ఎవరూ అతీతులు కాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలుమార్లు స్పష్టం చేశారని గుర్తు చేశారు.లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న సొంత పార్టీ ప్రజాప్రతినిధులపైనా చర్యలు తీసుకున్న విషయాన్ని ప్రస్తావించిన ఆమె, మహిళలపై అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై కూడా వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మహిళల భద్రత కోసం 'శక్తి' యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం, ప్రత్యేక మహిళా పోలీస్ విభాగాలను బలోపేతం చేయడం, సైబర్ వేధింపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం వంటి చర్యలు ప్రభుత్వం చేపట్టిందన్నారు. బాధిత మహిళలకు చట్టపరమైన సహాయం, కౌన్సెలింగ్ అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా వన్‌స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మహిళలను గౌరవించని రాజకీయాలకు రాష్ట్రంలో స్థానం లేదని స్పష్టం చేసిన అనంతలక్ష్మి, హోంమంత్రి అనితపై చేసిన వ్యాఖ్యలకు గుడివాడ అమర్నాథ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే భాషను ప్రజలు సహించరని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వరుణుడి కరుణ కోసం వాడపాలెంలో కప్పల కళ్యాణం

**ఎండల తీవ్రతతో వినూత్న పూజలు నిర్వహించిన గ్రామస్తులు**





**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 17 :** రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండగా, వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెం గ్రామస్తులు వరుణ దేవుడి కరుణ కోసం సంప్రదాయ పద్ధతిలో కప్పల కళ్యాణం నిర్వహించారు. వాడపాలెం గ్రామంలోని వంతెన సెంటర్ వద్ద డాక్టర్ పెద్దింటి రామం పురోహితులు, గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు పుష్కలంగా పండాలని కోరుతూ గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పురాతన నమ్మకాల ప్రకారం కప్పలకు శాస్త్రోక్తంగా వివాహం జరిపిస్తే వరుణ దేవుడు ప్రసన్నమై వర్షాలు కురిపిస్తాడనే విశ్వాసంతో రెండు కప్పలను పసుపు, కుంకుమలతో అలంకరించి సంప్రదాయబద్ధంగా వివాహం జరిపించారు. అనంతరం డప్పులు, భజంత్రీల మోతల నడుమ కప్పల జంటను గ్రామ వీధుల్లో ఊరేగించారు.యువకులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వినూత్న వేడుకను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు తరలివచ్చారు. ప్రకృతి కరుణించి త్వరలోనే మంచి వర్షాలు కురవాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.గ్రామీణ సంస్కృతి, సంప్రదాయ విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన ఈ కప్పల కళ్యాణం స్థానికంగా విశేష చర్చనీయాంశమైంది.

# ఘనంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదిన వేడుకలు






**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 17:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి,ఎస్.ఏ. ఎఫ్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సుభాష్ జన్మదిన వేడుకలను కొత్తపేట నియోజకవర్గ ఎస్.ఏ. ఎఫ్ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, విద్యార్థులతో ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకలు జరిగాయి.

ఈ సందర్భంగా వానపల్లి గ్రామంలోని శ్రీశ్రీ పళ్ళాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం ప్రజాసేవలో కొనసాగాలని, రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేసే అవకాశాలు కలగాలని దేవిని ప్రార్థించారు.

అనంతరం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్, పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు.

తదుపరి రావులపాలెంలోని శుభోదయ అంధుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మంత్రి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారితో ఆప్యాయంగా మమేకమయ్యారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేకంగా భోజనాలు ఏర్పాటు చేసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవను ప్రధాన ధ్యేయంగా తీసుకుని నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదినాన్ని సేవా దినోత్సవంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి చేరువయ్యేలా విద్య, వైద్యం, సామాజిక సంక్షేమ రంగాల్లో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఏ. ఎఫ్ నాయకులు బొక్కా ప్రసాద్, ముషిని వెంకటరమణ, కడలి బీమా, కడలి పార్థసారథి, కముజు వరప్రసాద్, దంగేటి సాయి, జోగి గని రాజు, కముజు శ్రీనివాస్, వనుము వెంకటేష్, దంగేటి ఆదినారాయణ, బొక్కా సాయి, దాసరి ప్రసాద్, అంబటి సాగర్, కోట లక్ష్మణ్, కోట శ్రీహరి, కొమ్మన స్వామినాయుడు, యనమదల రాజీవ్ తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే

**జగ్గంపేట సీఐ బి.తిరుపతిరావు**




**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 17:** మద్యం సేవించి ఎవరైనా వాహనాలు నడిపితే జైలుకు పంపిస్తామని జగ్గంపేట సీఐ బి.తిరుపతిరావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్, పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్ ఆదేశాల మేరకు జగ్గంపేటలో మంగళవారం సీఐ తిరుపతిరావు, జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు పోలీసు సిబ్బంది రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా జగ్గంపేట పోలీస్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పట్టుబడిని తొమ్మిది మందిని బుధవారం ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచారు. వీరిలో ఎనిమిది మందికి ఒక్కొక్కరికి ఏడు రోజుల చొప్పున జైలు శిక్ష విధించగా మరొక వ్యక్తికి రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని సీఐ తిరుపతిరావు పేర్కొన్నారు.

# వాకాడవారిపాలెంలో తాగునీటి దుస్థితి

- లీకేజీతో వృథాగా పారుతున్న మంచినీరు --
- బిందెలతో పట్టుకుంటున్న గ్రామస్తులు



**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 17:** కొత్తపేట మండలం వాకాడవారిపాలెం గ్రామంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. గ్రామంలో ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్‌లో లీకేజీ ఏర్పడి విలువైన నీరు నిరంతరం వృథాగా పారిపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకవైపు గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు లీకేజీ కారణంగా మంచి నీరు రోడ్డుపై పారిపోవడం బాధాకరమని స్థానికులు పేర్కొంటున్నారు. నీటి సరఫరా సక్రమంగా అందకపోవడంతో మహిళలు, వృద్ధులు లీకేజీ ప్రాంతానికి చేరుకుని బిందెలతో నీటిని పట్టుకుని తమ అవసరాలకు వినియోగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.గ్రామంలో తాగునీటి సమస్య చాలాకాలంగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వేసవి కాలంలో నీటి అవసరాలు అధికంగా ఉన్న సమయంలో ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు.ప్రజలకు అవసరమైన తాగునీటిని సక్రమంగా అందించడంతో పాటు లీకేజీలను వెంటనే మరమ్మతు చేసి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో నెలకొన్న పరిస్థితి తాగునీటి నిర్వహణలో ఉన్న లోపాలను స్పష్టంగా చూపుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి.

**-పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో తుమ్మలపల్లి రమేష్.**

**కిర్లంపూడి, పెన్ పవర్,జూన్ 17:** విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యలో బాగా రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. బుధవారం కిర్లంపూడి మండలం తామరాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2026--2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో తుమ్మలపల్లి రమేష్ పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమం స్కూల్ చైర్మన్ ఎలుబండి శ్రీను ఆధ్వర్యంలో, ప్రధానోపాధ్యాయులు కృష్ణ పర్యవేక్షణలో నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోకేడ రాజా, మండలం ఉపాధ్యక్షులు సత్యంశెట్టి వీరగణేష్, జనసేన సాధక్ తుంగపల్లి గోవింద్,గోకేడ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



